భాస్కరంకు పెళ్ళయి అయిదేళ్ళయింది. ఈమధ్యనేకదా పెళ్ళిరోజు పండుగకు పదిమంది స్నేహితుల్ని పిలిచారు. డిన్నరు తరువాత ఆటపాటలతో రాత్రి పదకొండుగంటల వరకు యింట్లో గొడవగా వుంది విమల వచ్చాక యిద్దరూ పుట్టిన రోజులు మరచిపోయి పెళ్ళిరోజుకే ప్రాధాన్యం యిచ్చారు. ఉన్నతోద్యోగం తెచ్చే బాధ్యతలు ఆఫీసులోకంటే యింట్లోనే యెక్కువగా వుంటాయ్. వచ్చేపోయేవాళ్ళకు మర్యాద, ఆదరణ, అనుగుణంగా మెసలి మాటాడటంలో విమల సిద్ధహస్తురాలైంది. వచ్చిన వాళ్ళ యెదురుగా మొగమాటానికి నవ్వి, వెనుక యింకోలా అనుకొనే పరిస్థితి ఆమె తీసుకు రాలేదు. పసుగురూ అనుకూలమైన దాంపత్యమని అనుకునేటట్లు రోజులు గడచిపోతున్నాయి. ఆమె వారంరోజులు విధిలేక కన్న వారింటికి వెళ్తే యిల్లంతా శూన్యంగా తోస్తుందతనికి. ఆఫీసులో కష్టపడి వచ్చేసరికి యిల్లు ఒక దేవాలయంగా వుండి అందులో భార్య ఒక దేవతలా పవిత్రంగా అగపడేది. ఆమె అతని సౌఖ్యంకోసం తీసుకునే శ్రద్ధ, కృషి యివన్నీ దేవత యిచ్చే వరాల్లా వుండేవి. ఆమె చామనఛాయగా నున్నా ముఖంలో హుందాతనం వెల్లివిరిసేది. కోలైన మనిషి, కళ్ళల్లో కాంతి, పెదవులపై చిరునగవు ఆమెను అందకత్తెను చేస్తాయ్.

ఆమె ప్రక్కలో నుండగా చూసిన సినీమాల్లో హీరోయిన్లు పేలవంగానే కనిపించేవారు. ఏ అందమైన బొమ్మ అతని మనఃఫలకంమీద శాశ్వతంగా ముద్ర వేసుకోలేకపోయింది. విమల అతని జీవితంలో భాగస్వామేకాదు. నాలుకలో నాలుకై మాటాడేది; కళ్ళల్లో కళ్ళయి చూసేది; మనసులో మనసై మెసిలేది. అంచేత ఆమె దగ్గర తను యేదీ దాచి యెరగడు. ఒకప్పుడు దాచే అవసరం వస్తుందనైనా వూహించలేదు.

విమల యీ సొగసైన మగడి చిక్కనైన ప్రేమలోని నైర్మల్యాన్ని అమృతంలా త్రాగేది. కాపురం పున్నమనాటి వెలుగులా, సంసారం సమానాంతర రేఖల్లా ఒడుదుడుకులు లేకుండా సాగిపోతోంది.

భాస్కరం పెళ్ళికాకముందు ఒకవంటవాణ్ణి చేరదీశాడు. ఒరియా బ్రాహ్మల అబ్బాయని చేరడు పొట్టిగా పేలవంగా వుండేవాడు. నోటిలో ఎప్పుడూ తమలపాకులు నములుతూ, జుత్తువెంబడి నూనె చెమటలా కారుతుండేది.

"పూర్ణచంద్రోపండా" అని యింత పెద్ద పేరుతో పిలవలేక భాస్కరం "ఫుల్ మూన్" అని యింగ్లీషులో పిలిచేవాడు. పేరుకు ఫుల్ మూనేగాని ముఖం యెప్పుడూ ధుమధుమలాడుతుండేది. చిన్న విషయాలకు అనవసరంగా బాధపడేవాడు. ఒకోసారి వచ్చిన కోపం కుక్కలమీద, కోళ్ళమీద చూపించేవాడు. యివి దెబ్బకు దొరక్కపోతే తన జుత్తు తనే పీక్కొని తనఒంటిమీదతనేకొట్టుకొనేవాడు. "పిచ్చివెధవ యింకా కుర్రతనం పోలేద"ని వయసు మళ్ళిన పనిమనిషి యివన్నీ చూసి అనుకొనేదిగాని బైట కనటానికి సాహసించలేకపోయేది. వాడికి బాబుగారంటే భక్తి, భయం వుండేది.

విమల వచ్చాక వంటపుట్టి చేతితిండి తినటం దుస్సాధ్యమైంది. ఆమె వంటలు కొత్త జిహ్వను సృష్టించాయ్. విధిలేక యేదో ఒకపూట ఫుల్ మూన్ వండితే యిప్పుడు ముట్టుకోలేకపోతున్నాడు. నూనూగు మీసాలతో వచ్చి, యీ యింటి వుప్పుతిని యింతవాడయ్యాడని వాడికి యేదో వుద్యోగం చూడమని విమలే చెప్పింది. వాడు వుద్యోగంలో చేరినా యీ యిల్లు వదల్లేదు. అమ్మగారికి సహాయం చేస్తూ బంగళా వేరట యిదివరకున్న సేవకుల యింట్లో వుండేవాడు.

ఉద్యోగంలో ఫుల్‌మూనుకి విలువ పెరిగింది. ప్రతినెలా మిగిల్చి అమ్మగారి దగ్గర దాచుకున్న యైదువందల రూపాయలు పట్టుకొని వాళ్ళ వూరు సెలవుపై వెళ్ళాడు. రెండు కాళ్ళతో వెళ్ళి అనుకోకుండా నాలుగుకాళ్ళతో వచ్చాడు. వాడు ఫుల్‌మూన్‌కాకపోయినా వాడి పెళ్ళాం ఫుల్‌మూనుగా వుంది. వాడికంటే పొడగరి. అరముగ్గిన అరటిపండులాంటి శరీరచ్ఛాయ. ముక్కులో నత్తు, చెవులకు ఎత్తుగొలుసులు,

కాళ్ళల్లో వెండి పట్టీలు, కంటికింపుగా కాటుక, వొంటినింపుగా పసుపు, ఒత్తుగా పెరిగిన వల్లని పాయలైన జుత్తు వెనుకకు ముడుకులవరకూ వ్రేలాడుతుంది. పాయలో యెర్ర కుంకుమ, తీర్చిదిద్దిన కనుబొమ్మలు ముద్దులొలికే పెదాలు, పెరిగిన యవ్వనంతో, పెల్లుబికిన వయ్యారంతో సమ్మోహనంగా వుంది వాళ్ళ కట్టు తీరుతో మగడు చెప్పగా వంగి చేతులనింపుగా గాజులు గలగలలాడుతూ భాస్కరం పాదాలకు మ్రొక్కింది. ఆమెను చూస్తూంటే కళ్ళ వేడుగ్గా వుంది.

"ఈ కాకి వెధవకి యీ దొండపండెలా దొరికింది?" - భాస్కరం యెదుటవాని అదృష్టానికి కొద్దిగా యేవగించుకున్నాడు. ఆమెను ఆ క్షణంనించి మరచిపోవాలని నేర్చింది. ఒకో పలుకు చిలుకపలుకులా పెగులుతోంది. ఇదివరకంతటి పసుపు ముఖానికి మొత్తలేదు. అప్పుడప్పుడు ముఖాన పౌడరు కనిపిస్తోంది. గాడీ రంగు ఎర్ర చీరలు కట్టకుండా లేత రంగులు-ఒకోసారి తెల్లని గ్లాస్కో చీరలతో ప్రత్యక్షమౌతోంది.

జీవితం నటన కాదని యిదివరకనుకున్నవాడు యిప్పుడు విమల దగ్గిర తన నిత్య జీవితం నటనే అయిపోయింది. మగవాడు తుమ్మేదంటే ఎవరో నిగ్రహం లేని వాడే అలాంటి వుపమానం తీసుక వచ్చాడని అనుకున్నాడు. తనపూర్వీకులు నీతినితప్పుతూనే నీతిని బోధించారు. తను నీతిని పాటిస్తూనే నీతిని యేవగించుకుంటున్నాడు. నటించడం చేతకానివాడు మనిషిగా బ్రతక

# వేషక

**బలివాడ కాంతారావు**

అనుకున్నా ఆవేశం చల్లారలేదు. దానికి కారణం ఆమె అప్పుడప్పుడూ అతని కంట పడటమే. కంటపడినప్పుడు బాహాటంగా చూసినా, బాగుండేది. ఆమె తలవంచుకునేది. ఒకోసారి ముసుగులోనించి తొంగి చూవేది. ఆ చూపులో కొంటెతనం. ఆ పెదిమెలపై దరహాసం వేర్వేరు అర్థాలను సృష్టించేవి. ఆమె ముఖం చూడ్డానికి యేదో పని గట్టుకొని యెదురుచూసేవాడు. మొదటసరదాకి, వేళాకోళానికి - ఆమె సిగ్గు తగ్గించడానికిచేసిన ప్రయత్నం రానురాను అనురాగపు మొగ్గయై పుష్పించే సమయంకోసం వేచివుంది.

మొదట సైగలతో అమ్మగారికి సాయం చేస్తుండిన మాయ యిప్పుడు కొద్దిగా బాస లేదని అతను రోజుకు రోజు నటనకే ప్రాధాన్యమిచ్చాడు. ఉదయమే షికారుకి వెళ్తున్నట్టు నటించి మాయ కనుపిస్తుందేమో అని చూసేవాడు. కిటికీ గుండా ఆమె ఒకోసారి తొంగి చూసేది. ఆలోచనలు కోరికకై, కోరికలు ఆవేశాలను పొంగించి అదనుకోసం ఆతృతపడసాగాడు. ఒకసారి స్నానంచేసి కిటికీ దగ్గర నిర్భయంగాఅద్దంచూసుకొంటూకనుపించింది. వూహించలేని అందమది. మరుక్షణంలో ఆ తడిచిన పలుచని చీర నంటుకున్న అందం వూహలోనే మిగిలింది.

ఆమె అతన్ని చప్పున చూసింది. గాభరాగా మూలకు కదలిపోయింది. తనకి తెలుసు. ఆమె లోకం కోసం సిగ్గుపడుతుందని. ఆ మరు

క్షణంలో తనే ఆమెను యేలుకోటానికి సిద్ధపడితే తనలాంటి అందగానితో లేచి రావటానికి ఆమె వెనుదీయదని అనుకున్నాడు. ఒకసారి మాయ యెందుకో కిటికీదగ్గర నిల్చుని నవ్వింది. భాస్కరం అక్కడున్నట్లు ఆ దగ్గరే పచార్లు చేస్తున్నట్లు ఆమెకు తెలీదు. అదే సమయంలో చలిలో మంచంమీదపడుకున్న ఫుల్‌మూన్ లేచి చూశాడు. వాడివేపు చూడని భాస్కరం వుప్పొంగిపోయాడు. రోజుకి పదిసార్లయినా ఆమె ముఖం చూస్తేనేగాని వుండలేకపోతున్నాడు. ఎన్నెన్నో ఆలోచనలు. ప్రక్కనున్న మాయను భార్యగా వూహించి దరిచేర్చుకొనే రోజులు లేకపోలేదు. భార్య కొన్నాళ్ళు ఇంట్లో లేకపోతే మాయ వంట చేసేది. అప్పుడామె దగ్గరగా చేరే అవకాశం వుండేదని మాటవరసకు విమల కన్నవారింటికి వెళ్తానంటే వెళ్ళమన్నాడు.

విమల మాయతోను ఫుల్‌మూన్‌తోను అంతా చెప్పి వెళ్ళింది. ఇద్దరూ కలసి పనులు చేస్తున్నారేగానీ మాయ ఒక్కరైతే తారసపడలేదు. భోజనానికి వచ్చేటప్పుడు టేబిలు మీద అంతా అమర్చి మాయమయ్యేది. ఈ మధ్య ఆమె ముసుగు విప్పిన చలువరాతి బొమ్మలాగా వుంది. నిత్యం నూతనంగా వుండే అందాల వెలుగులు ఆమె మొఖంలో కదలిపోతున్నాయ్. ఈ పెదాలపై చిమ్ముతున్న మధువు పొగాకు వాసనతో ఆ మోటు పెదాలు త్రాగటం, యీ అందాల రాసులను వాడి మోటు చేతులతో నలిపివేయటం, యీ బంగారు ఛాయ ముఖమల్‌లాంటి శరీరాన్ని ఆ మురికి చేతులు అంటుకోవటం - భాస్కరం వూహిస్తునే వెర్రివాడయ్యాడు. తనకే ఆ హక్కువుంటే ఒక గగనకుసుమం - ఓ ఊర్వశి దొరికినట్లు వరప్రసాదంలా తీసుకొనేవాడు. ఒక శిల్పియై ఆమె వివిధ భంగిమలను పాలరాతిలో మలచేవాడు. నిత్యయౌవ్వనుడై యీ నిండు జాబిలిని తాకేవాడు. అతను ఆవేశంతో అన్నీ అనుకున్నాడు. ఏదీ సాధించలేకపోయాడు.

ఈ రాత్రికి విమల తిరిగి వస్తుందనగా యీ వారం రోజులూ వృథాగా పోయాయన్న బాధతో మాయను యీ రోజైనా ముట్టుకుందామన్నంత ఆవేశం కలిగింది దానికి తగ్గట్లు ఆమె పెరటి వాకిట్లో బియ్యం బాగుచేస్తూ ఒంటిగా కూర్చుంది; కిటికీగుండా ఒకసారి చూశాడు. ఆమె శరీరంపై అట్టే పట్టింపు చేసుకోనట్లుంది. క్రొత్తగా మలచిన అయస్కాంతంలా ఆకర్షిస్తోంది. పనిచేస్తూ యేదో ఆలోచనలో పడిపోయింది. ఎన్నడూ లేనిది యేవో విషాదరేఖలు ముఖంలో కదలుతున్నట్లున్నాయ్. ముక్కులో నత్తులేదు. చెవులో యెత్తుగొలుసులులేవు. కాళ్ళల్లో ఒక్క వెండి పట్టీలు తప్పించి యింకేమీలేవు. జుత్తువిరబోసి ఇలావున్నా ఆమెఅందంతో అతనిలో మందిరాన్ని నిర్మించి అధిదేవతగా కూర్చుంది. ఎవరూ యెక్కడాలేరు. తనూ, ఆమె. ఆమె తన బాసను యిప్పుడు అర్థం చేసుకోగలదు. ప్రేమలోని గూఢార్థాలు కూడ యీసరికి తెలిసే వుంటయ్ కట్టుబాట్లతో తాళం వేసిన కోరికల పెట్టెను ఒకసారి విప్పి వదలిపెట్టడం కూడా తెల్సివుండాలి. ఎలాంటి సుఖం సరియైన తృప్తి యిస్తుందో ఆమె యిక వూహించనక్ఖర్లేదు. నీతి గీసిన గీత దాటి సుఖం పొంది మళ్ళీ గీతలోనికి రావటం మనుషులకు పరిపాటై అలా యిద్దరూ ఒక్కసారైనా గీత దాటడానికి అనువైన సమయం యిదే.

పెరటి గుమ్మంనించి మెల్లగా తొంగి చూశాడు. ఆమె అతనిని యింకా గుర్తించలేదు. ఆమె అవయవాల సొంపును చూస్తూ వుద్రేకం చెందిన భాస్కరం ఆమె అతను వచ్చినట్లు గుర్తించకూడదని కోరుకున్నాడు. కాని ఆమె చప్పున అతనిని చూసింది. గాభరాపడి బట్ట సర్దుకుంది. ఆ కళ్లు లేడి కళ్ళలా బెదిరాయ్. కన్నీరుతో నిండిపోయాయి. ఆమె అక్కడనించి వెళ్ళిపోవటం అతనికి సహించరాని పని. అందుకే చప్పున స్ఫురించి "మంచినీరు కావాలి"న్నాడు—అలా అని లోపల డైనింగు టేబిలు దగ్గర కూర్చున్నాడు

ఆమె గ్లాసులో నీరు తెచ్చి టేబిలుమీద పెట్టి వెళ్ళిపోతుంటే—

"ఏం అలావున్నావ్-అని అడిగాడు. ఆమె ముఖం తిప్పి నడుస్తున్నది. ఆగి ఒకసారి వెను తిరిగి చూసింది ఆ చూపు తెరపై ముక్కోటి మధురస్మృతులు ఆగుపడ్డాయ్. చప్పున లేచి దగ్గరగా వెళ్ళాడు. ఆమెపై చేతులు వెయ్యటానికి చేతులు వణికాయ్.

కాసీ ఆవేశం ఆపుకోలేక పోయాడు. అంతా మరచిపోయాడు. ఆమె తట్టుకోలేక గాబరాతో వణికిపోయి కదలిపోయింది.

మైకం వీడి బైటపడే సరికి అంగటకిటికీ దగ్గర ఫుల్‌మూన్ నిల్చునివున్నాడు. వాడిదంతా చూ స్తే యిద్దరి బ్రతుకులూ అల్లకల్లోలమై పోతాయ్. విమలతో తను యిక కాపరం చెయ్యలేడు. ఆమె అతని దగ్గర మెసల్లేదు. ఇన్నాళ్ళ శిఖరం చేరాలని యెగబ్రాకి యీ గతివాడతో క్రిందమన్న అఘాతంలోనికి జారటం సహించలేడు.

ఎందుకు తపిలా చేశావని నొచ్చుకున్నాడు. మగవాళ్ళ సాహసం చూశాకే ఆడవాళ్ళ యిష్టం బయట పడుతుంది. ఆ సాహసం తను చెయ్యకపోతే ఆమె కోరి బయట పడదు. ఐనా కిటికీ బయట తనకంటే ముందుగా పసివాడు చూసి వుండబట్టే మాయ అంత వేగిరంగా కదలిపోయిందేమో నని అనుకున్నాడు. ఇష్టం లేకపోతే ఒక కేకైనా వేసేది. ఏమైనా పరిస్థితులు చెయ్యిజారి పోకముందే మేల్కొనటం మంచిదనుకున్నాడు. ఏదో తాత్కాలికమైన ఆనందానికి శాశ్వతమైన శాంతిసుఖాలకు దూరం కావటం తనకు యిష్టంలేదు.

ఫుల్‌మూన్ యేమీ అనకుండా తనను చూస్తూనే వెళ్ళిపోయాడు. ఐనా వాడివేపు చూడటానికి మనస్కరించలేకపోయాడు. మాయ ముఖంకూడ మరి కనపడలేదు. విమల వచ్చి వస్తూనే "మీనాకున్నట్టే తయారయ్యారు" అంది. భాస్కరం నవ్వాడు.

"నేను లేకపోతే మీరో క్షణం వుండలేరని వెను తెలుసు. మరెప్పుడూ మిమ్మల్ని వదలి నాళ్లమలెండి".

నమ్మిన ఆడదాన్ని చెరపకూడదని భాస్కరం విమలను దగ్గరగా తీసుకున్నాడు. ఇన్నాళ్ల ఆరాటం యీనాటి మాయ గాబరాతో చప్పనైంది. తనెందుకలా చెయ్యాలి? తనగురించి ఒక సదభిప్రాయం, భయం, భక్తి కలిగిన ఆ యిద్దరూ యేమనుకుంటారు? ఇకనించి యీ నటనను చాలించి నిజ జీవితంలో అడుగు పెడ్దామని నిర్ధారించుకున్నాడు. అంతా తమాషాగా వేడుకగా జరిగినట్లుంది. అందనిపళ్లకు అర్రులు చాచినవానిలా అయిపోయాడు. పశ్చాత్తాపంతో కనువిప్పు కలిగిందనుకున్నాడు. ఐనా లోలోన మాయకు తనపై మమకారం వుందని లోకానికి వెరచి వెనుకంజ వేసిందని అనుకూల పరిస్థితులలో తనకు పూర్తిగా వశం అయ్యే అవకాశం లేకపోలేదన్న ఆశతోనే కళ్ళు మూశాడు.

ఇంక సరిగ్గా తెల్లవారనే లేదు. ఎవరో తలుపు తట్టున్నారు. భాస్కరం తెలివిగా వుండి మాయతో తన వ్యవహారాన్ని నెమరువేసుకుంటున్నాడు. తలుపు తీసేసరికి ఫుల్‌మూన్ ఆతృతతో "మాయ కనపడలేదు బాబూ" అన్నాడు.

"ఎక్కడకు వెళ్ళింది?"

"ఏమో? నాకు భయంగా వుంది."

"కొట్టావా? తిట్టావా?"

వాడి నోటివెంబడి మాట రాలేదు. ఎన్నో సంవత్సరాలు తపస్సుచేసి పొందిన పెన్నిధిని యెవరో దోచుకపోయినట్లు వెక్కి-వెక్కి ఏడ్వ సాగాడు.

"ఏమన్నా అన్నావా?"

ఇంతలో విమలకూడా వచ్చింది.

"నా కోపం మీకు తెలుసు కదా బాబూ? మాటకు జవాబిస్తే రెండేశాను."

"ఉత్తి అమాయకురాలు. దాని ని కొట్టే అవసరం యేం వచ్చిందిరా?" విమల అందుకుంది.

వాడు జవాబు చెప్పకుండా ఒకసారి యిద్దరి ముఖాలు చూసి తలదించేశాడు.

"పద - ఎటు వెళ్లిందో చూద్దాం."



ఇద్దరూ బయలుదేరారు.

"ఇంట్లోకి పద" అన్నాడు భాస్కరం.

అప్పుడప్పుడూ శ్రావ్యంగా ఒరియా పురాణాలు ఆమె చదువుతుండగా భాస్కరం వినేవాడు. ఏ పురాణాల్లోనైనా ఏ వుత్తరమైనా పెట్టిందేమోనని చూశాడు. పెరటి వంటయింట్లో గోడమీద బొగ్గుతో యేవో పెద్ద అక్షరాలతో ఒరియాలో రాసుంది. చదవమన్నాడు.

"నామట్టుకు నేనే తెగించి చచ్చిపోతున్నాను. ఎవరి తప్పులేదు."

అది చదువుతూ ఫుల్‌మూన్ గగ్గోలు పెట్టా

కూలిపోయాడు. భాస్కరం అక్కడ మరి వుండలేక కదలిపోయాడు. అతనికి తెలుసు - ఈ సౌందర్యరాశిని యెంత ఆప్యాయతతో చూసేవాడో. ఆమె వండితే ఆ మని అంటుకుంటుందని తనే రాత్రుళ్లు వండేవాడు.

ఆమె మరీ చక్కగా కనపడాలని రకరకాల చీరలు, పౌడర్లు, వాసన నూనెలు, పువ్వులు తెచ్చేవాడు. ఈ ఆరాధన అనుమానంగా మారుతున్నా వాడు ఆవేశపడటం తను చూడలేదు. ఆవేశం యెల్లప్పుడూ రాదు. వచ్చినా ఒక్కసారి విజృంభిస్తుంది. ఇన్నాళ్ళూ అంటే ఆమె కిటికీదగ్గర నిల్చుని నవ్విననాటి నించీ ఆవేశపడ్తూనే వున్నాడు. గడచిన రాత్రే ఆ ఆవేశం విజృంభించింది. ఆ విజృంభనను తప్పు లేని ఆమె తట్టుకోలేకపోయింది. పౌరుషంగల స్త్రీ చేసిన తెగువే ఆమె చేసింది. ఆ దగ్గరలోనున్న లోతునూతిలో మాయ శవం తేలిపోయి వుంది.

రాత్రి పుల్‌మూన్ యెక్కడకు పోయాడో కనిపించలేదు. విమలకు తిండి సహించలేదు. రోజంతా కన్నీరు ఆగలేక పోయింది. ఈ సరసం యిలా విరసం అవుతుందనుకోని భాస్కరంకు నడుం జారిపోయింది. ఈ చావుకు కారకుడు తనేనని, తనో హంతకుడన్న తలపు వదన్నా వెంటాడుతోంది—

విమల పడుకోలేదు. అతనికి నిద్దర రాలేదు.

"పడుకో" అన్నాడు.

విమల జవాబు చెప్పలేదు. అతనికి దగ్గరగా జరిగింది.

"ఏంటాలోచిస్తున్నావ్?"

"మాయ...ఎంతపని చేసింది? ఎందుకలా చేసిందో అర్థం కావటంలేదు"

"ఏమో?"

"ఎప్పుడూ నవ్వుతూవుండేది. నేను దేవిశైనా కోప్పడితే నవ్వుతూతీసుకునేది. వాడు క్రూరుడు - కాని ఆమె అంత నెమ్మదైనది. సరదాగా వుండేది. ఎన్ని చెప్పిందండి! అమ్మకి నాన్నకి ఒక్కర్తే కూతురట. గొప్పముద్దట. దూరం వచ్చేస్తుందని వారంరోజులవించి తల్లీ తండ్రీ యేడుపట. ఎన్ని కలలుగంది? - తొలికాన్పు కొడుకుకావాలని - పాపం! కోడలు కూడా యెలా వుండాలో వూహించుకుంది. అలాటి మాయకు చావు వెంబడిస్తోందని అనుకోలేదు. అందులో బలవంతం చావు... అంతా మాయ కదండీ? ఏ క్షణంలో యేమౌతామో తెలీదు కదా? ఇలాంటి క్షణికమైన బ్రతుకు బ్రతుకుతూ, బ్రతుకంతా ఒక వేడుక అనుకుంటాం. ఎన్నో కోరుకుంటాం...ఎన్నో ఆశలు పెట్టుకుంటాం - వీటికోసం యెన్నో అన్యాయాలు చేస్తాం - ఎంత గర్విస్తాం - ఎంత హీనంగా ప్రవర్తిస్తాం...ఛీ ఛీ..."

"ఆగు విమలా ఆగు......" అంటూ భాస్కరం ఘొల్లున యేడవసాగాడు...

★

